30న సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మహాదేవపురం కాలనీలోని షిర్డీ సాయిబాబా ఆలయ 13వ వార్షికోత్సవాన్ని ఈనెల 30న నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటలకు కాకడ హారతి, పంచామృతాభిషేకం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, ఋత్విక్కరణం, దీక్షాధారణ, రక్షాబంధనం, మండపారాధన, లక్ష్మీగణపతి హవనం, నవగ్రహవనం, బాబా మూల మంత్ర హవనం, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నసంతర్పణ, రాత్రి 7 గంటలకు పల్లకీసేవ, రాత్రి 9 గంటలకు శేషహరతితో వేడుకలు ముగియనున్నాయి.

వినాయకనగర్ అధ్యక్షుడిగా ఎండీ సలీం



సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలోని వినాయకనగర్ సొసైటీ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. మొత్తం 602 మంది ఓటర్లు ఉండగా, 552 ఓట్లు పోలయ్యాయి. ఎండీ సలీం 40 ఓట్ల మెజార్టీతో ప్రత్యర్థి రవి నాయక్‌పై అధ్యక్షుడిగా గెలుపొందారు. ఈ సందర్భంగా ఎండీ సలీం మాట్లాడుతూ.. పూర్తి కార్యవర్గాన్ని త్వరలో ఎన్నుకుంటామన్నారు. అనంతరం ఆయనను మాజీ సర్పంచ్ దాబా శ్రీను, మాజీ వార్డు సభ్యుడు పరశురాంగౌడ్ సన్మానించారు.

రోడ్డు పనులు ప్రారంభం



నిజాంపేట్ : ప్రగతినగర్ నాలుగో డివిజన్‌లో రోడ్డు మరమ్మతు, అలాగే నూతన రోడ్డు పనులను కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు పనులకు సహకరించిన కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, కొలన్ రాజశేఖర్‌రెడ్డి, కమిషనర్ సాబేర్‌అలీ, ఎన్ఎంసీ ఇంజినీరింగ్ సిబ్బందికి కాలనీవాసులతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సరేంద్రకుమార్ యాదవ్, మద్ది నారాయణరెడ్డి, కాలనీవాసులు పవన్, శివ, సుబ్బు, మహమ్మద్, యుగంధర్‌రెడ్డి, చంద్రశేఖర్, రమేశ్, రాఘవేంద్ర, రామారావు, మల్లేశ్వరరావు, శ్రీనివాస్ రావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పగలే.. వెలుగు.!



కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలో పగలే వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు

రంగారెడ్డినగర్: జంట సర్కిళ్లలోని పలు ప్రధాన రహదారుల్లో గల వీధి దీపాలు పగలే వెలుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలో ఆదివారం మధ్యాహ్నం హైమాస్ట్ లైట్లతో పాటు షాపూర్‌నగర్‌కు వెళ్లే రహదారిలో వీధి దీపాలు వెలుగుతూనే కనిపించాయి.

సీఎం కృషితోనే రిజర్వేషన్

మేడ్చల్: సీఎం రేవంత్‌రెడ్డి కృషితోనే మాదిగలకు 9 శాతం రిజర్వేషన్ వచ్చిందని మాదిగ జేఏసీ అధ్యక్షుడు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. మేడ్చల్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ సెల్ నాయకులతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. వర్గీకరణ బిల్లుకు మద్దతు ఇచ్చిన వారిని మాదిగలు ఎప్పటికీ మరువరని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు భానుచందర్ మాదిగ, చిన్నయ్య, మల్లేష్, ప్రవీణ్‌కుమార్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దారులన్నీ.. ఎల్కతుర్తికే

- వరంగల్‌లో అట్టహాసంగా బీఆర్ఎస్ రజతోత్సవ సభ
- పెద్ద సంఖ్యలో తరలివెళ్లిన శ్రేణులు
- పార్టీ జెండాలు ఎగరేసిన నాయకులు



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

కుత్బుల్లాపూర్: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఆ పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలు, నిజాంపేట్ కార్పొరేషన్, గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, అనుబంధ సంస్థ కార్యకర్తలు వెళ్లారు. అంతకుముందు జరిగిన కార్యక్రమాల్లో నాయకులు పార్టీ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా 2001లో ఏర్పాటైన బీఆర్ఎస్ ఎన్నో త్యాగాలు, ఆటుపోట్లను ఎదుర్కొని పార్టీ అధినేత కేసీఆర్ సారథ్యంలో స్వరాష్ట్రాన్ని సాధించామని పేర్కొన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే ప్రధానాంశంగా తెలంగాణ ఉద్యమం కొనసాగిందని, కేసీఆర్ నేతృత్వంలో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి పదేళ్ల పాలనలో దేశానికే దిక్సూచీగా నిలిపారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడూ జరిగినా బీఆర్ఎస్‌దే విజయమని వారు ధీమా వ్యక్తం చేశారు.



గండిమైసమ్మ చౌరస్తాలో జెండాను ఎగరేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు..



కొంపల్లిలో మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో..



ప్రగతినగర్‌లో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న కొంపల్లి మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు సతీశ్‌సాగర్

కుత్బుల్లాపూర్: స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని కొంపల్లి మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు పెద్దబుద్దల సతీశ్‌సాగర్ అన్నారు. కొంపల్లిలోని ఏఎంఆర్ గార్డెన్‌లో బీజేపీ సంఘటనా సంచారణ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన యాత్రికుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణ, కార్యవర్గ విస్తరణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా కొంపల్లి మున్సిపల్ పరిధిలో బీజేపీ సంస్థాగతంగా బలోపేతం అవుతుందని దానికి మల్కాజ్‌గిరి పార్లమెంట్ గెలుపే నిదర్శనమని పేర్కొన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ విజయం సాధించేలా ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ అడుగు జాడల్లో కొంపల్లిలో బీజేపీ జెండాను ఎగుర వేయాలని కోరారు. అనంతరం బీజేపీ కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన 'మన్‌కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షించారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యకుడు రాజిరెడ్డి, కౌన్సిల్ సభ్యుడు జనార్దన్ రెడ్డి, ఓబీసీ ఉపాధ్యక్షుడు అశోక్, గిరిజన మోర్చా నాయకుడు శంకర్ నాయక్, అసెంబ్లీ కోకన్వీనర్ శివాజీ రాజు, సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి, చక్రధర్, నర్సింగ్ రావు, మహేశ్వర్ రెడ్డి, మధు, మహేందర్ సాగర్, మురళీకృష్ణ, ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం



ఆశావహుల పేర్లను సేకరించిన కృష్ణారెడ్డి, వెంకటేశ్

దుండిగల్: గండిమైసమ్మలో మున్సిపల్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి అధ్యక్షతన మున్సిపల్ బీజేపీ కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి దుండుగుల వెంకటేశ్ మాట్లాడుతూ..స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రజా సమస్యలపై పోరాడాలని, సరైన టీంలను ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. అదేవిధంగా మున్సిపల్ కమిటీలు, వివిధ బాధ్యతలు చేపట్టేందుకు ఆసక్తి చూపిన పలువురి ఆశావహుల పేర్లను సేకరించి రాష్ట్ర కమిటీకి పంపించారు. సమావేశానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేష్వర్ చారి, రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు శ్యాంరావ్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోనె మల్లారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ మల్లేశ్ యాదవ్ ఓబీసీ మోర్చా కార్యదర్శి శ్రీశైలం యాదవ్, మున్సిపల్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఎంబరి ఆంజనేయులు, ఆకుల మల్లేశ్, మాజీ ఉపాధ్యక్షుడు పిట్ల లక్ష్మణ్, మాజీ ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ యాదవ్, నర్సింహా చారి, భానుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు..అన్నదానాలు



ఆలయంలో భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు



మగ్దుమ్‌నగర్‌లోని మల్లికార్జున స్వామి ఆలయంలో అన్నదానం

జగద్గిరిగుట్ట: అమావాస్యను పురస్కరించుకొని పలు దేవాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు, అలంకరణ, అభిషేకాలు, అన్నదానాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

- జగద్గిరిగుట్ట కొండపై ఉన్న కాళికాదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహిళా భక్తులు భగవద్గీత పారాయణం చేశారు. తర్వాత కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.
- జగదిరిగుట్ట బస్టాప్ సమీపంలోని దుర్గామాత ఆలయంలో పూజలు చేసి, శ్రీ వాసవి సేవ సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.
- మగ్దుమ్‌నగర్‌లోని మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం తదితర పూజలు చేసి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.
- చింతల్ బస్టాప్‌లో శ్రీ సప్తగిరి వైశ్య ఫ్రెండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

అలాగే అమావాస్య సందర్భంగా మగ్దూంనగర్, మైసమ్మ నగర్ లోని బొడ్రాయి ల వద్ద స్థానికులు ప్రత్యేక పూజలు చేశారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ 76 మంది

కుత్బుల్లాపూర్: అల్వాల్, జీడిమెట్ల, బాలానగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రెండు రోజుల్లో చేపట్టిన డంక్రన్ డ్రైవ్‌లో 76 మంది మందుబాబులు పట్టుబడ్డారు. అల్వాల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో సుచిత్ర, దూలపల్లి చౌరస్తా, కొంపల్లి ప్రాంతాల్లో తనిఖీ చేయగా 30 మంది, అలాగే జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 25 మంది, బాలానగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 21 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ దొరికిపోయారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



జగద్గిరిగుట్ట: పద్మానగర్ కాలనీ ఫేస్-1లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ప్రాణదార హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన క్యాంప్‌లో సుమారు 75 మందికి పలు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు.

ఉగ్రదాడి మృతులకు ఘన నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న సీపీఐ కార్యకర్తలు

జగద్గిరిగుట్ట: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడులను ఖండిస్తూ నిరసన తెలిపారు. అలాగే మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆదివారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యుడు హరినాథ్ రావు, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, రాములు, కే వెంకటేశ్, మహిళా సమైక్య అధ్యక్షురాలు హైమావతి, యువజన సమైక్య కార్యదర్శి వెంకటేశ్, ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు బాబు, సీపీఐ నాయకులు ఇమామ్, నరసింహ, శ్రీకాంత్, సామెల్, రవి, యాదయ్య, ఆశప్ప, సత్యనారాయణ, జంబు తదితరులు పాల్గొన్నారు.

'ఫ్లాట్లు అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి'



కాలనీవాసులతో కలిసి మాట్లాడుతున్న రామచంద్రనాయక్

నిజాంపేట్ : రాజీవ్ గృహకల్పలో ఖాళీ ఫ్లాట్లు అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేనా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రనాయక్ డిమాండ్ చేశారు. రాజీవ్ గృహకల్పలో స్థానికులతో కలిసి ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. హౌసింగ్ బోర్డ్‌వారు లబ్ధిదారులకు కేటాయించిన కొన్ని ఖాళీ ఫ్లాట్లను బీఆర్ఎస్, ఇతర పార్టీల నాయకులు ఇల్లులేని వారికి ఆశ చూపి ఒక్కొక్క ఫ్లాట్‌కి రూ.5 లక్షల నుండి రూ.8 లక్షల వరకు ఫ్లాట్‌ను విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఫ్లాట్లను దొడ్డిదారిన అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్న నాయకులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజీవ్ గృహకల్ప కాలనీవాసులు పాల్గొన్నారు.

వైష్ణవి ఎన్‌క్లేవ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఎంపీఆర్ చంద్రశేఖర్, కోశాధికారిగా రాకేశ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్.డీ.హుస్సేన్, బాలకృష్ణ (బీకే గౌడ్), జాయింట్ సెక్రటరీగా ఏ.నాగరాజు, ఎం.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శివకుమార్ పాండే, కమిటీ మెంబర్లుగా కృష్ణమూర్తి రాజు, జే సత్యనారాయణ, సందీప్‌రెడ్డి, ఎస్.శ్రీకాంత్, మహిళా సభ్యులుగా గీతాసింగ్, భాగ్యలతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రోడ్ నంబర్-2లోని పార్కు స్థలంలో సమావేశం నిర్వహించగా కాలనీ సలహాదారు కృష్ణమూర్తిగౌడ్ ప్రారంభించారు. పలు అభివృద్ధి, పెండింగ్ పనులపై చర్చించి ఎంపీఆర్ చంద్రశేఖర్ అధ్యక్షతన పలు తీర్మానాలు చేశారు.

విద్యారంగ అభివృద్ధికి టీఎస్‌యూటీఎఫ్ కృషి



సాక్షి, సిటీబ్యూరో: విద్యారంగ అభివృద్ధికి టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ తెలిపారు. ఉపాధ్యాయ నాయకులు నిరంతరం అధ్యయనం చేస్తూ..ఉపాధ్యాయ ఉద్యమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. శని, ఆది వారాల్లో నగరంలో టీఎస్‌యూటీఎఫ్ మేడ్చల్ జిల్లా శాఖ నిర్వహించిన ఉపాధ్యాయ ఉద్యమ తరగతులను ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించారు. మొదటి రోజు ×ఉపాధ్యాయ ఉద్యమం×అనే అంశంపై ఉపాధ్యాయ రాష్ట్ర నేత పాపన్నగారి మాణిక్ రెడ్డి బోధించారు. ఈ సందర్భంగా సంఘం పని విధానం, ఉపాధ్యాయ సమస్యల సాధనకు సంబంధించిన ఉద్యమం పని తీరును మాణిక్‌రెడ్డి వివరించారు. రెండవ క్లాస్‌లో 'విద్యారంగం-శాస్త్రీయ ఆలోచనలు'అనే అంశంపై సంఘం రాష్ట్ర కార్యదర్శి జ్ఞాన మంజరీ మాట్లాడుతూ..ఉపాధ్యాయులు విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగయ్య, జిల్లా అధ్యక్షులు ఓ జయసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి మదన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రాకేష్, వందన, జిల్లా కోశాధికారి గొడుగు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు మహిపాల్ రెడ్డి, కుమారస్వామి, సుందరయ్య, సుధాకర్, అనంతయ్య, ఆడిట్ కన్వీనర్ గౌరయ్య, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు..!

600 చదరపు అడుగుల విస్తీర్ణం దాటితే..అంతే

- తొలి విడతలో ఎంపికైన వాటిలో బేస్‌మెంట్ పూర్తయింది 28 ఇళ్లే..
- రెండో విడతలో లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు
- వచ్చే నెల 5 వరకు లబ్ధిదారుల తుది జాబితా



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మరింత వేగవంతంగా చేపట్టేలా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు కాగా, సంబంధించి లబ్ధిదారుల ఎంపికను మే 5 నాటికి పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే జనవరి 26న మండలానికి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొదటి విడతలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 752 ఇళ్లు మంజూరు కాగా, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 308 మంది లబ్ధిదారులను ఎంపిక చేసిన చేశారు. ఇళ్ల నిర్మాణ పనులు కూడా ప్రారంభించారు. మిగిలిన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు యుద్ధప్రాతిపదికన అధికార యంత్రాంగం ప్రభుత్వ నిబంధనల ప్రకారం కసరత్తు చేస్తోంది. పేదల్లో అతి పేదలకు ముందుగా ప్రాధాన్యం ఇచ్చి ఎంపిక చేయాలని యోచిస్తున్నారు. ఇళ్ల మంజూరు చేయడమే కాకుండా ఎంపికైన లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా అవసరమైన సాయం అందించేందుకు మండలానికి ఒక బృందాన్ని నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

తొలి విడతలో 28 ఇళ్లకు పూర్తయిన పునాది..

తొలివిడతలో ఎంపిక చేసిన వాటిలో 28 ఇళ్లకు బేసిమెంట్ నిర్మాణం పూర్తయ్యింది. ఒక దశ విజయవంతంగా ముగియటంతో అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి విచారించి నిర్మాణ ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. లబ్ధిదారులే పునాది వరకు నిర్మించాక అధికారులు బిల్లింగ్ చేస్తే మంజూరైన మొత్తంలో ప్రభుత్వం తొలివిడతగా రూ.లక్షను వారి ఖాతాల్లో జమచేస్తోంది. పేదలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం, బేసిమెంట్ వారే నిర్మించుకోవాలని నిబంధన పెట్టడంతో పలువురు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

రెండో విడత ఇళ్ల మంజూరుకు కసరత్తు..

రెండో విడత ఇళ్ల మంజూరుకు కసరత్తు ప్రారంభమైంది. ఇళ్ల కోసం ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను గ్రామాలు, పురపాలక సంఘాల వారీగా స్థానిక ఎమ్మెల్యేలకు అందజేయగా, వారు పరిశీలించి, ఆ జాబితాను అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నియమించిన ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలోని ఇందిరమ్మ కమిటీలకు అందజేశారు. ఈ కమిటీలు కూడా జాబితాపై మరోసారి విచారణ నిర్వహించి, ఎంపీడీవోలు, పురపాలక అధికారులు అప్పగించగా, వారు ఈ నెల 30 వరకు మరో సారి విచారణ చేపట్టనున్నారు. మే 5 వరకు తుది జాబితాను పోర్టల్‌లో మరోసారి విచారించి..జిల్లా ఇన్‌చార్జి మంత్రికి నివేదిస్తారు.

విస్తీర్ణం దాటితే...అనర్హతే..

నిరుపేదల సొంతింటి కల సాకారం చేయడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు నిబంధనలు పాటించకుంటే అనర్హులుగా గుర్తిస్తారు. సొంత ఇంటి స్థలం ఉన్న పేదలు 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో తమకు ఇష్టమొచ్చినట్లు ఇల్లు నిర్మించుకోవచ్చని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. లబ్ధిదారులకు పలు విడతల్లో రూ.5 లక్షల సాయం అందజేయనుంది. తొలిదశలో పునాది పూర్తయిన ఇంటి నిర్మాణాలకు మొదటి విడతగా రూ.లక్ష చొప్పున నిధులు విడుదల చేస్తారు. గృహ నిర్మాణశాఖ పునాది పూర్తయిన ఇళ్ల కొలతలు చేస్తుండటంతో..కొంతమంది లబ్ధిదారులు ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించారు. వీరికి మొదటి విడతగా చెల్లించే రూ.లక్ష నిలిపివేశారు. 600 చదరపు అడుగుల స్థలం మించి నిర్మాణం చేపట్టిన వారు పేదలు కాదని, వారికి ఇందిరమ్మ పథకం వర్తించదని గృహనిర్మాణ శాఖ చెబుతుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా..?

అధ్వానంగా వీఎన్ఆర్ కళాశాల నుంచి బొడ్రాయి రోడ్డు



గుంతలమయంగా రోడ్డు

దుండిగల్: అసలే గతుకుల రోడ్డు..ఆపై అడుగుకో గుంత.. ఇది దుండిగల్ మున్సిపాలిటీ భౌరంపేట పరిధిలోని వీఎన్ఆర్ కళాశాల నుంచి భౌరంపేటలోని బొడ్రాయి వరకు రోడ్డు దుస్థితి. రోడ్డంతా పూర్తిగా గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఆ ప్రాంతం గుండా వెళ్లాలంటేనే వెన్నులో వణుకు పుడుతోంది. ముఖ్యంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద కొన్ని రోజులుగా డ్రైనేజీ పొంగి రోడ్డుపైనే గుంతల్లోకి చేరుతోంది. రాత్రి సమయాల్లో గుంతలను గమనించక వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



గుంతలో రోడ్డులో వెళ్తున్న వాహనదారులు